11

శిథిలాలయంలో శివుడు లేడోయి

ఆధార సర్వశాస్త్రాణం కలానాం శ్రామికస్యచ
ఆదర్శోవై ప్రజానాంచ కర్మణ్య త్వస్య ప్రేరకః
దేవ శిల్పీతి విఖ్యాతః విశ్వ కర్మేత్య పిస్మృతః
సర్వ స్వం ధర్మ రక్షార్థ మర్పితుం ప్రేరక స్వయమ్
విశ్వ కర్మన్నహం స్మృత్వాత్వాం సదా ప్రథమం తతః
ప్రారంభే నిత్యకర్మాణి ఆ శిషం దేహిమే సదా...

శ్లోకం చదువుతూ కళ్ళు తెరిచారు గౌరీపతిగారు... డెబ్బయ్యేళ్ళ వయసు... కానీ అంతకంటే ఇంకో పదేళ్ళెక్కువ వార్ధక్యం ఆయనలో తొంగి చూస్తోంది. రోజూ నిద్రలేవగానే ఈ శ్లోకం చదువుకుని భగవంతుని ధ్యానం చేసుకోవడం ఆయన అలవాటు. కళ్ళు తెరిచేటప్పటికి రోజూ ఎదురుగా కనిపించే శివుడు ఆ రోజు కనిపించలేదు. ఇరవై రోజులయింది ఆయన మంచంపట్టి. ఈ ఇరవై రోజుల్లోనూ ఆయన నిద్రలేచేటప్పటికి ఎదురుగా మంచం దగ్గర ఆయన సేవకోసం ఉండకపోవటం ఒక్కసారి కూడా జరగలేదు. మొహం కడిగించడం దగ్గర్నించి అన్నిపన్లూ తనే దగ్గరుండి చేస్తున్నాడు శివుడు.

రెండు రోజులుగా గాలీవానా... జిల్లా మొత్తం ముసురు పట్టింది. కొంచెం కూడా తగ్గుముఖం పట్టలేదింకా... శివుడు వంటింట్లో ఏదైనా పన్లో ఉన్నాడేమో ననుకుంటూ మంచాన్ని ఆసరాగా చేసుకుని ఎలాగైతేనేం మెల్లిగా లేచి ఆ గదిలోనే ఉన్న సింక్ దగ్గర మొహం కడుక్కోవడం పూర్తి చేశారు. ఆ కాస్తకే బాగా నీరసం వొచ్చేసింది. కాళ్ళు వొణుకుతున్నాయి. మొహం తుడుచుకుని మళ్ళీ మంచమ్మీద

వెనక్కి వాలిపోయారు. ఎదురుగా గోడకున్న శివపార్వతుల పటం చూస్తూ చేతులు జోడించారు.

మృత్యుభీతమృకండు సూను కృతస్తవం శివసన్నిధౌ
యత్ర కుత్ర చయః పఠేన్నహితస్య మృత్యుభయం భవేత్
పూర్ణమాయుర రోగతా మఖిలార్థ సంపద మాదరం
చంద్రశేఖర ఏవతస్యదదాతి ముక్తి మయత్నతః
చంద్రశేఖర చంద్రశేఖర చంద్రశేఖర పాహిమాం
చంద్రశేఖర చంద్రశేఖర చంద్రశేఖర రక్షమాం॥

"శివా... శివా..." ఓపిక చేసుకుని కాస్త గట్టిగా పిలిచారు. తను లేచిన అలికిడివిన్నైనా శివుడు తన దగ్గరికి రాకపోవడం చాలా ఆశ్చర్యంగా ఉందాయనకి.

"ఈ రోజెందుకో రోజుకంటే నీరసం ఎక్కువగా అనిపిస్తోంది. పంజరంలోంచి ఈ చిలుక ఎగిరిపోయే రోజు ఇవాళేనేమో శివా!" అని శివుడితో చెప్పుకోవాలని పిస్తోంది.

"కాఫీయేగా... ఇదిగో..." కర్రవిరిచినట్టు కటువుగా అంటూ కాఫీగ్లాసు మంచం దగ్గర స్టూల్‌మీద పెట్టాడు వంటమనిసి సుబ్బయ్య. ఎన్ని సంవత్సరాలుగానో తన కాఫీ, భోజన విషయాలు పట్టించుకునేది శివుడొక్కడే... ఇంకెవరికీ ఈ ఇంట్లో తనంటే లక్ష్యమూ లేదు... శ్రద్ధాలేదు... అటువంటిదీ రోజు?...

"శివుడేడీ?" అడగకుండా ఉండలేకపోయారు.

"ఏమో?" విసురుగా జవాబిచ్చి వెళ్ళిపోయాడు సుబ్బయ్య.

బ్రహ్మస్వరూపముదయే మధ్యాహ్నేతు మహేశ్వరం
సాయంధ్యాయేత్సధావిష్ణుం త్రిమూర్తించ దివాకరం...

ముసురుపట్టి రెండ్రోజులుగా కనిపించక దాగున్న ఆ సూర్యభగవానుడిని ధ్యానించుకుని కాఫీ గ్లాసందుకున్నారు నెమ్మదిగా.

ఓ పదినిమిషాలు ఓపికగా ఎదురు చూశారు... ఉహూ... శివుడి జాడలేదు. గది బయట కొడుకు మాట వినిపించింది.

"రాఘవా!..." కేకేశారు మరి ఆగలేక.

"ఏవిటి నాన్నగారూ?" లోపలి కొచ్చాడు రాఘవ.

"శివుడేడీ?"

"లేడు..."

"ఏవిటి నువ్వనేది?"

"అన్నట్టు... రాత్రి జరిగిన గొడవ మీకు తెలియదు కదూ..."

"ఏం గొడవ? డాక్టర్‌గారు నిద్రమాత్రలిచ్చారు కదా నాకు... ఒళ్ళు తెలియకుండా నిద్రపట్టేసింది. అసలేం జరిగింది?"

"ఇంట్లోంచి పొమ్మని కోప్పడ్డాను. వెళ్ళిపోయాడు".

"శివా శివా... ఎంత పెద్ద తప్పు చేశావు?"

"ఏవిటి నాన్నగారూ మీరు మరీను... శివుడు దొంగతనం చేశాడు. ఆఫ్టరాల్... ఈ ఇంట్లో ఓ నౌకరు. అతి చనువిచ్చి నెత్తికెక్కించుకున్నారు మీరు. ఈ వయసులో దొంగబుద్ధి పుట్టింది..."

"రాఘవా..."

"ఇంతోటి ఆ నౌకరు కోసం నామీద అరుస్తారేవిటీ?... మీ పన్లు చెయ్యడానికి మరో నౌకర్ని చూస్తాన్లెండి. గదిలో బల్లమీద పెట్టిన మీ కోడలి గొలుసు కనిపించలేదు. రాత్రి ఇంట్లో అన్ని గదుల్లోనూ తిరిగేది శివుడేగానీ ఆ సుబ్బయ్య కాదుగా? మంచివాడు మంచివాడని మొదటి నుంచీ నెత్తికెక్కించుకున్నారు మీరు. ఆ లోకువతోనే తనమీద అనుమాన పడరన్న ధైర్యంతో ఇంతపని చేశాడు. ఏ రోజు ఎవరికెలాంటి బుద్ధి పుడుతుందో ఎవరు చెప్పగలరు?" దురుసుగా అన్నాడు.

"రాత్రికి రాత్రి ఇంట్లోంచి పొమ్మన్నావా? ఎక్కడున్నాడో ఈ గాలీవానలో... శివుడిని పొమ్మనే హక్కు ఈ ఇంట్లో ఎవరికీ లేదురా అబ్బాయ్... లేదు... చిన్నప్పటి నుంచీ నువ్వు చేసిన ఎన్నో పొరపాట్లు... తప్పులు క్షమిస్తూ వచ్చాను. కానీ... ఈ తప్పు క్షమించడం... శివుడిని అనుమానించి నువ్వు చేసిన మహాపరాధం క్షమించడం నా వల్ల కాదు...

ఈ ఇంటినొక ఆలయంగా భావిస్తూ నన్నొక దేవుడిగా తలుస్తూ... మన మనసులకి తను కష్టం కలిగించకుండా... తన మనసుకి మనం కలిగించే కష్టాల్ని

చిరునవ్వుతో దిగమింగుతూ ఇన్ని సంవత్సరాలుగా... విశ్వాసంతో మనకి సేవ చేసిన శివుడిని అనుమానించి ఇంట్లోంచి పొమ్మన్నావా? దొంగతనం చెయ్యవలసిన అవసరం శివుడికి లేదు... అతను కావాలనుకుంటే ఈ ఇల్లు ఈ సంపద ఏనాడో అతనివి అయి ఉండేవి... ఆ మంచి మనిషి దృష్టిలో దయాదాక్షిణ్యాలకి... విశ్వాసానికీ ఉన్న విలువ డబ్బుకి లేదు. విశ్వాసం అతని ఊపిరి... అటువంటి శివుడికి కావల్సింది డబ్బు బంగారం కాదు... ఆప్యాయత అనురాగం కోరుకుంటాడు శివుడు..." ఆవేదనతో ఆవేశంతో తండ్రి ఊగిపోతుంటే చిరాగ్గా మొహం పెట్టాడు రాఘవ్.

"చిన్న విషయానికి ఎందుకింతగా ఆవేశపడిపోతున్నారు? అసలే మీ ఆరోగ్యం ఏవీ బాగులేదు. ఏ మాత్రం తేడా వొచ్చినా ప్రమాదం అని డాక్టర్‌గారు చెప్పారు కదా" దురుసుగా తండ్రి మీద విసుక్కుంటూ అక్కడి నుంచి వెళ్ళిపోబోయాడు.

"ఆ ప్రమాదం ఏదో ఇవాళ వొచ్చితీరుతుంది. రానియ్యి. ఇప్పటికైనా నీకు నిజం తెలియడం మంచిది. చెప్పేస్తాను. ఇలారా..." మంచమ్మీద తనపక్కన చోటు చూపిస్తూ కూర్చోమంటూ... తను వెనక్కి వాలారు గౌరీపతిగారు. మొహం చిట్లించుకుని ఇబ్బందిగా కూర్చున్నాడు రాఘవ్.

✧ ✧ ✧

గౌరీపతిగారెంత మంచి మనిషో ఆయన భార్య అన్నపూర్ణమ్మ కూడా అంత మంచి మనిషి. ఎన్ని విషయాల్లోనో ఏదో ఒక విధంగా వాళ్ళ సహాయం పొందిన వాళ్ళు ఆ ఊళ్ళోనే కాదు చుట్టుపక్కల ఊళ్ళల్లో కూడా చాలామంది ఉన్నారు. ధనసాయం... మాటసాయం... మనిషిసాయం... అన్ని విధాలుగానూ తమకి చేతనైనంతలో అందర్నీ ఆదుకునేవారు. ధనం ఉంది. పలుకుబడి ఉంది. దయాగుణం ఉంది. ఆ దంపతులకి లేనిదల్లా సంతానం ఒక్కటే. ముగ్గురు పిల్లలు పుట్టిపోయారు. ఆ బెంగతో మనిషి సగం అయింది అన్నపూర్ణమ్మ. దేనిమీదా ఆసక్తి లేకుండా పోయిందావిడకి. అదో రకంగా నిరుత్సాహంగా తయారైంది. భార్యని చూస్తుంటే భయం వేసేది గౌరీపతిగారికి.

ఒకరోజు... ఆ రోజు... తమ ఇంటి అరుగుమీద ఎవరో పడుకుని ఉండడం చూసి దగ్గరగా వెళ్ళి పలుకరించారాయన. ఆ వ్యక్తి ఏదో మాట్లాడబోయాడు గానీ... వెంటనే మాటరాలేదు నీరసంతో.

"ఒంట్లో బాగులేదా? జ్వరంగా ఉందా? ఏ ఊరు మీది?" అడుగుతూనే ఒళ్ళు ముట్టుకుని చూశారు. ఆ మాత్రం పరామర్శకే ఆ వ్యక్తి కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. చేతులెత్తి నమస్కరించబోయాడు. చేతులు పూర్తిగా పైకిలేపే ఓపిక కూడా లేకపోయిందతనికి.

"అన్ని బాధల్లోకి కష్టమైన బాధ ఆకలిబాధ బాబూ... ఇంకాస్సేపట్లో నా ప్రాణం పోవడం ఖాయం. నాలుగైదు రోజులైపోయింది బాబూ ఏవన్నాతిని..." పరీక్షగా తనవంకే చూస్తున్న ఆయనతో మళ్ళీ తనే అన్నాడు.

"అడుక్కునే వాడిని కాదండీ. అందుకే చేతిలో పైసాలేకపోయినా... చేసేందుకు పనేమీ దొరక్కపోయినా... ఎవర్నీ దేహీ అని అడగలేదు... పస్తులతో... ఇలా ప్రాణం పోయే స్థితిలో వున్నాను".

నవ్వారు గౌరీపతిగారు మృదువుగా. "నీ ప్రాణం ఏమీ పోదు. భయపడకు. అన్నం తిందువుగాని... లోపలికిరా..." చేయి అందించి లోపలికి తీసికెళ్ళారు. భార్యని కేకేసి అన్నం పెట్టించారతనికి. అప్పుడు చెప్పాడతను తన గురించి... పేరు శివుడు. దాయాదులు మోసం చేసి ఆస్తంతా కాజేస్తే కట్టుబట్టల్తో వీధిన పడ్డాడు. ఇటు ఆస్తీ పోయింది... అటు చదువూ చదువుకోలేదు.

క్షుద్బాధ తీర్చి ప్రాణభిక్ష పెట్టడమే కాదు... ఇంట్లో ఆశ్రయం కూడా ఇచ్చారు శివుడికి గౌరీపతిగారు. ఆ ఇంట్లో అన్ని పన్లూ చేస్తూ వాళ్ళ ఆదరణ ఆప్యాయతలే ఆస్తిగా భావించుకుని తృప్తిపడ్డాడు శివుడు.

శివుడి పెళ్ళి గౌరీపతిగారే చేశారు.

అన్నపూర్ణమ్మ నాలుగోసారి ప్రసవించడం శివుడి భార్య మొదటిసారి ప్రసవించడం ఒక్కరోజే జరిగాయి. గౌరీపతిగారి బిడ్డ దక్కలేదు. తల్లి స్పృహలో లేదు. స్పృహ వొచ్చాక... ఈ బిడ్డ కూడా దక్కలేదని తెలిస్తే... అసలే అర్భకంగా... కళ్ళల్లో ప్రాణాల్తో వున్న తన భార్య తనకి దక్కకుండా పోతుందేమో!... వీల్లేదు... ఎలాగైనా బతికించుకోవాలి తన భార్యని... పరిగెత్తుకెళ్ళి శివుడి చేతులు పుచ్చుకున్నారు. "నా భార్యని బతికించు శివా..."

"బాబుగారూ! ఏవిటి మీరనేది?"

"అమ్మగారికి తెలివిరాగానే... పుట్టిన బిడ్డ ఈసారికూడా దక్కలేదని తెలిసి పిచ్చిదానిలా అయిపోతుంది... ప్రాణమైనా విడుస్తుంది. పిల్లలకోసం ఎంతగానో తపించిపోతోంది. ఇలా అడుగుతున్నందుకు నన్ను క్షమించు శివా. నీ బిడ్డని తీసుకొచ్చి మా ఆవిడ పక్కన పడుకోపెడతాను. నీ పిల్లాడు మా పిల్లాడవుతాడు. అమ్మగారి ప్రాణాలు కాపాడు..."

తెల్లబోయాడు శివుడు. గుండెరాయి చేసుకుని బాబుగారి కోసం... అమ్మగారికోసం ఏం చెయ్యడానికైనా సిద్ధపడ్డాడు. తన భార్యని ఓదార్చడమే కష్టమైపోయింది. ఒక్కరోజు కాస్త అన్నం పడేస్తేనే ఎంతో విశ్వాసం చూపిస్తుంది కుక్క. కుక్కకంటే ఉత్తమమైనది కాదా మానవ జన్మ... ప్రేమతో ఆదరిస్తూ... తమ ఇంటిలో ఒకడిగా చేర్చుకున్న ఆ పుణ్యదంపతుల పట్ల విశ్వాసం చూపించడం తన ధర్మం కాదా?... అంతే... స్థిరనిశ్చయానికొచ్చి భార్యకి నచ్చచెప్పాడు. ఆమె కన్నీటిని తుడిచాడు. తన కన్నీటిని దిగమింగుకున్నాడు. కన్నబిడ్డని బాబుగారి చేతుల్లో ఉంచాడు. కృతజ్ఞతతో గౌరీపతిగారి కళ్ళల్లో నీళ్ళు నిలిచాయి. తన ఇల్లు... తనకున్న పొలంలో సగం పొలం శివుడి పేరున రాసి ఆ కాగితాలు అతనిచేతిలో పెట్టారు.

"నా భార్య ప్రాణం దక్కించావు. ఏమిచ్చినా తీరేది కాదు నీ ఋణం".

"బాబుగారూ! ఆస్తులు అయిన వాళ్ళ మధ్య గొడవలు తెచ్చిపెడతాయని అనుభవపూర్వకంగా తెల్సుకున్న వాడిని నేను. మీ ఆదరణ... ఆప్యాయత అనే ఆస్తిపాస్తులు చాలు నాకు. డబ్బుమీద వ్యామోహం ఏనాడో చచ్చిపోయింది నాలో. ఇలా మీకు సేవ చేస్తూ ఉండిపోనివ్వండి" చిరునవ్వుతో చేతిలో కాగితాలు చింపేశాడు.

శివుడిలో దైవత్వాన్ని గౌరీపతిగారు చూశారు. గౌరీపతిగారిలో దేవుడిని శివుడెప్పుడో చూశాడు.

ఆ తర్వాత కొద్ది రోజుల్లోనే బాలింత జబ్బుతో శివుడి భార్య పోయింది. తన కాలాన్నీ శ్రమనీ పూర్తిగా ఆ ఇంటికి అంకితం చేశాడు.

రాఘవ్ బాబుకి దెబ్బ తగిలితే తనకి తగిలినట్టుగా గిలగిలలాడిపోయేవాడు. బాబుకి జ్వరం వొస్తే తను లంఖణాలు చేసేవాడు. పెరిగి పెద్దవుతున్న కొద్దీ బాబు తనని నౌకరుగా తీసిపడేసి దురుసుగా మాట్లాడుతుంటే చీటికీ మాటికీ చీదరించు

కుంటుంటే... ఆవేదన గుండెల్లోనే అణిచిపెట్టి చిరునవ్వుతో తిరగడం అలవాటు చేసుకున్నాడు. అప్పుడప్పుడు బాబుకి నీతులు నేర్పబోయి... మంచీ చెడ్డా చెప్పబోయి నీకెందుకు పొమ్మంటూ చీవాట్లు తినేవాడు బాబుచేత.

గౌరీపతిగారి మనసు కూడా కలుక్కుమంటుండేది శివుడి పరిస్థితికి.

తప్పు బాబూ అలా మాట్లాడకూడదు. శివుడినేమీ అనకూడదని చెప్తూనే ఉండేవారు.

ఆ మాటలు రాఘవ్ చెవికి ఎక్కేవి కావు. అబ్బాయిగారి దృష్టిలో ఇంటి నౌకరికి ఏ మాత్రం విలువ లేదు. నౌకర్లకి చనువు ఇవ్వకూడదు. ఇస్తే నెత్తికెక్కుతారన్నదే అతని ఉద్దేశం. అందుకే... శివుడు తనంటే అగ్గగ్గలాడుతూ అల్లంత దూరంలో చేతులు కట్టుకు నిలబడాలని... ఎప్పుడూ దురుసుగానే మాట్లాడేవాడు అతనితో.

అమ్మగారు బస్సుయాక్సిడెంట్లో పోయినప్పటినించీ... అయ్యగారికి వేళకి అన్ని అమర్చే బాధ్యత పూర్తిగా తనే తీసుకున్నాడు శివుడు.

✧ ✧ ✧

"ఇదంతా ఏదో సినిమా కథలా అనిపిస్తోందేమో నీకు... కానీ నూటికి నూరుపాళ్ళు ఇది నిజం రా అబ్బాయ్! నిజం.... నీ కన్న తండ్రి శివుడే" చెప్పడం పూర్తిచేసి... ఎక్కువగా మాట్లాడినందువల్ల కలిగిన ఆయాసంతో ఇబ్బంది పడుతున్నారు గౌరీపతిగారు.

"ఏవండీ! నా గొలుసు దొరికింది. పెట్టెలోనే ఉంది... ఇదుగో... బల్లమీద పెట్టానని అనుకున్నాను. అందుకని ఎంతసేపూ బయటే వెతికాను". రాఘవ్ భార్య మొహం చేటంత చేసుకుని గొలుసు చేత్తో పట్టుకునొచ్చిందా గదిలోకి.

అప్పటికే రాఘవ్ మొహం పాలిపోయింది. శివుడిని తన కన్న తండ్రిని అనవసరంగా అనుమానించి ఎన్నెన్ని మాటలన్నాడు తను.

"శివా!... శివా!..." శివుడినే తల్చుకుంటూ ఆయాసం ఎక్కువై తలవెనక్కి వాల్చేశారు గౌరీపతిగారు.

ఆంధ్రప్రభ వారపత్రిక